చిట్టి కథ

# భక్తి కాని భక్తి

ఫోన్ గణగణ మంటూ మ్రోగింది. పక్కనే కూర్చున్న కృష్ణమోహన్ వెంటనే ఫోన్ ఎత్తాడు. రెండు నిముషాలు మాట్లాడి 'ఓకే. వుయ్ విల్ బీ వెయిటింగ్' అనేసి ఫోన్ పెట్టేశాడు. లేచి 'శాంతీ' అంటూ వంటింట్లోకి నడిచాడు. భర్త పిలుపు విని పమిటతో చేతులు తుడుచుకుంటూ వచ్చేసింది శాంతి. "చౌహాన్ ఫోన్ చేశాడు. వాళ్ళ పేరెంట్స్‌ని రేపు పొద్దున్న తొమ్మిది గంటలకి తీసుకొస్తాడుట. వాళ్ళకి ఏం చేస్తావో ఆలోచించి వుంచుకో" అన్నాడు. ఒక్కక్షణం ఆలోచించి 'దోశెలు, ఆవడలు చేస్తాను. తీపి ఏం చెయ్యాలో ఆలోచిస్తాను' అంది శాంతి. "నీ ఇష్టం ఇదే మొదటి సారి. బ్రహ్మాండంగా వుండాలి టిఫెన్స్" అన్నాడు. "అలాగే వాళ్ళు చాలాకాలం గుర్తు వుంచుకునేలా చేస్తాను సరేనా!" హామీ యిచ్చింది శాంతి. చిన్నగా నవ్వేసి భార్య బుగ్గమీద చిటికె వేసి వెళ్ళిపోయాడు కృష్ణమోహన్.

కృష్ణమోహన్ ఇంజనీరు. చౌహాన్ డాక్టర్. కృష్ణమోహన్ కృష్ణాజిల్లా వాడు. చౌహాన్ కాష్మీర్‌లో సెటిల్ అయిన యు. పి. కుటుంబానికి చెందిన వాడు. కృష్ణమోహన్‌కి ఒక భార్య, ఆరు నెల్లకొడుకు వున్నారు. చౌహాన్‌కి కూడా ఒక భార్య వుంది. అయితే ఆవిడ ఎక్కడ వుందో అతనికి ఇంకా తెలీదు. అది తెలుసుకోవాలనే చాలా గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు, అతని తల్లిదండ్రులు. కృష్ణమోహన్, చౌహాన్ ఇద్దరూ ఒరిస్సాలోని మారుమూల కొండ ప్రాంతానికి ఉద్యోగ రీత్యా వచ్చారు. ఒకరినొకరు చూసుకున్న వేళావిశేషం ఎటువంటిదో కానీ ఇద్దరూ ప్రాణస్నేహితులు అయిపోయారు. మెస్‌లో భోజనం చేసే చౌహాన్ విసుగువేసి నప్పుడల్లా 'భాభీజీ' అంటూ శాంతి దగ్గరకు చొరవగా వచ్చేసి దక్షిణాది వంటకాలతో సుష్టుగా భోజనం చేసి "బహుత్ అచ్చా, షుక్రియా" అనేసి వెళ్ళిపోవడం సర్వసాధారణం.

పూరీ యాత్ర చేద్దామని కొడుకు దగ్గరకు వచ్చారు చౌహాన్ తల్లి తండ్రులు. కృష్ణమోహన్ శాంతి, చౌహాన్ ఇంటికి వెళ్ళి వాళ్ళని పరిచయం చేసుకుని తమ ఇంటికి భోజనానికి రమ్మని ఆహ్వానించారు. చౌహాన్ తల్లి బాగా పాతకాలం మనిషి. ఆవిడ ఏనాడూ ఇల్లుదాటి వెళ్ళలేదు. బోలెడు ఆచారాలు, చాదస్తాలు వున్నాయి. పూర్తిగా శాఖాహారి. మొహమాట పడిపోయి "పూరికే వస్తాం భోజనం వద్దు" అంది. కాదనీ అలా వీల్లేదనీ, తాము కూడా శాఖాహార్లమేననీ, ఉల్లిపాయ కూడా తినమనీ, ఎన్నో విధాల చెప్పాక చివరకు పొద్దున్న వ్వుడు టిఫిన్‌కి రావడానికి అంగీకరించింది. వీలు చూసుకుని ఎప్పుడు వచ్చేదీ ఫోన్ చేస్తాను అన్నాడు చౌహాన్.

చెప్పిన ప్రకారం తొమ్మిదికల్లా కొడుకు హాస్పిటల్ వేనులో దిగారు అతిధులు. ఆదరంగా ఎదురేగి ఆహ్వానించారు కృష్ణమోహన్ దంపతులు. పసివాడిని ఎత్తుకుని వాడి బూరెబుగ్గను ముద్దు పెట్టుకుని, వాడికోసం తను తెచ్చిన డ్రెస్, బొమ్మ వాడి చేతికి ఇచ్చింది చౌహాన్ తల్లి శకుంతలా చౌహాన్. "ఎందుకండీ ఇవన్నీ" అంటూ వారించిన శాంతిని పెద్దరికంతో మందలించింది. 'ఇల్లు చూద్దురుగాని రండి' అంటూ లోపలికి తీసుకు వెళ్ళింది శాంతి. స్టీలు బిందెని, వెంకటేశ్వరుడి పటాన్ని, కంచి పట్టు చీరెలనీ, కొండపల్లి బొమ్మలనీ, ఊరగాయ జాడీలనీ కుతూహలంగా చూసి మెచ్చుకుంది. ఇల్లంతా చూపించాక డ్రాయింగ్ రూమ్ లోకి తీసుకుని వచ్చి కూచోబెట్టి దోశెలు వెయ్యడానికి వంటింట్లోకి వెళ్ళింది శాంతి.

కాసేపు మగవాళ్ళ దగ్గర కూర్చుని వాళ్ళ రాజకీయాలు వినేసరికి విసుగు వేసింది ఆవిడకి లేచి లోపలికి వెళ్ళింది. అటూ ఇటూ చూస్తూ పెరట్లోకి వచ్చేసింది. చిన్న పెరడు అందులో మధ్యగా తులసికోట. తులసికోట ఎదురుగా చక్కని ముగ్గు. భక్తిగా నమస్కరించింది. ఏ రాష్ట్రమైనా ఏ జాతి అయినా దేవుడు ఒక్కడే కదా! అనుకుంది భక్తిగా మరోసారి చుట్టూ చూస్తూ. హఠాత్తుగా ఆవిడ కళ్ళు మెరిశాయి. భక్తితో ఆవిడ గుండె బరువెక్కింది. గిర్రున వెనక్కి తిరిగి వంటింట్లోకి వచ్చింది. దోశెలు పోస్తున్న శాంతి తలా చెంపలూ నిమిరి బుగ్గలు పుణికి ముద్దు పెట్టుకుంది. ఏమిటేమిటో చెప్పేస్తూ తనని ముద్దులాడుతున్న ఆవిడని వింతగా చూసింది శాంతి. హిందీ అంత బాగారాని శాంతికి ఆవిడ సొద ఏమిటో అర్థం కాలేదు. ఆవిడ తనని పొగుడుతోంది అని మాత్రం గ్రహించగలిగింది. అంతలో కృష్ణమోహన్ ఎందుకో వంటింట్లోకి వచ్చాడు. గభాల్న అతని దగ్గరకు వెళ్ళి అతని తల నిమిరింది శకుంతలాచౌహాన్. "నిన్నూ, నీ భార్యనీ, నీ ఇంటినీ చూసి నా మనసు సంతోషంతో నిండి పోయింది. నీ భార్య ఎంతో ఉత్తమురాలు ఈ కాలం పిల్లల్లా కాదు. ఆహా ఆ మర్యాద, ఆ భక్తి ఆ శ్రద్ధ అంత దైవభక్తిగల భార్య దొరకటం నిజంగా నీ అదృష్టం. ఇంత చిన్న వయసులో ఇంత దైవభక్తి అలవడడం పూర్వజన్మఫలం. ఆ దైవం మిమ్మల్ని చల్లగా కాపాడుతాడు." ఆనంద బాష్పాలతో తన భార్యని గురించి చెప్తున్న ఆవిడని వింతగా చూశాడు కృష్ణమోహన్. అతనికి అయోమయంగా వుంది. నిజానికి శాంతికి అంత దైవభక్తి లేదు. ఎప్పుడో మూడ్ కుదిరినప్పుడు తీరిగ్గా పూజ చేస్తుంది. లేకపోతే 'ఏడుకొండలవాడా వెంకటాచలపతీ' అంటూ తల్చుకుని వూరుకుంటుంది అంతే. మరి ఈవిడ ఇలా పొగిడేస్తోంది. ప్రశ్నార్థకంగా భార్యని చూశాడు తెల్లమొహం వేసుకుని నుంచుని వుంది శాంతి. వాళ్ళిద్దర్నీ అలాగే వదిలేసి డ్రాయింగ్ రూమ్‌లోకి వెళ్ళింది ఆవిడ. "చూశారా ఎంత భక్తులో వీళ్ళు! ఇది ఇల్లు కాదు. మందిరం. రండి స్వామికి ప్రణామం చేద్దాం. ఆ దేవుని దయవల్ల మన కోరిక తీరి మనకూ ఇలాంటి కోడలే దొరుకుతుంది." అంటూ హిందీలో చెప్తూ భర్తని తీసుకుని పెరట్లోకి వెళ్ళింది. చౌహాన్ కూడా కుతూహలంతో వాళ్ళని అనుసరించాడు. అయోమయంగా మొహమొహాలు చూసుకుంటూ శాంతి కృష్ణమోహన్ అటువైపు నడిచారు. వేగంగా వెళ్ళిన శకుంతలా చౌహాన్ తిన్నగా వెళ్ళి శాంతి కాపురానికి వస్తూ వెంట తెచ్చుకుని గ్రైండర్ కొనగానే మూల పడేసిన రుబ్బురోలు దగ్గర ఆగింది. భక్తిగా కొంగు తలమీదుగా కప్పుకుని "జై బోలో శంకర్ భగవాన్ కీ" అంటూ ముమ్మారు ప్రదక్షిణం చేసి ఆ రోటికి ఎదురుగా కూర్చుని భక్తిగా ప్రణమిల్లింది. ఏనాడూ రుబ్బురోళ్ళ పొత్రాన్ని చూసి ఎరుగని ఆవిడ వాటిని చూసి శివలింగంగా భావించిందని అప్పటికి అర్థం చేసుకున్న శాంతీ, కృష్ణమోహన్ నవ్వాపుకోలేక సతమతం అయిపోయారు.

—పి. విజయలక్ష్మి, చిత్తరంజన్